


తరలించి.. తాపించి..!

జగన్ సభకు కర్ణాటక జనం.. మద్యం

- సభాప్రాంగణంలో తాగుతూ.. ఊగుతూ..
- సీఎం ప్రసంగిస్తుండగానే వెళ్లిపోయిన మహిళలు
- విపక్షాలపై ఎప్పటిలాగానే సీఎం విమర్శలు
- వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సొమ్ము విడుదల


సీఎం ప్రసంగం కొనసాగుతుండగానే వెళ్లిపోతున్న జనం

సభలో జనం కనిపించాలి.! అంతే.! వారు ఓటర్లా.. స్థానికులా.. స్థానికేతరులా అన్నది అనవసరం. ఇదే ఎత్తుగడ వేసింది అధికార పార్టీ. ఉరవకొండలో నిర్వహించిన సీఎం సభకు కర్ణాటక నుంచి కూడా జనాన్ని సమీకరించారు. భారీ ధరల నేపథ్యంలో రాష్ట్ర మద్యాన్ని కొని పంచడం ఖరీదైన వ్యవహారం అనుకున్నారో ఏమో.. కర్ణాటక నుంచి జనంతోపాటు మద్యాన్ని కూడా డంప్ చేసుకున్నారు. తాగినోళ్లకు తాగినంత పోశారు. తాగినోళ్లు ఊగారు.. తూగారు.. మత్తు ఎక్కువై పడిపోయారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సొమ్ము విడుదల కోసం ఏర్పాటు చేసిన సభను విజయవంతం చేసేందుకు అధికార పార్టీ నానా పాట్లు పడింది. రాయలసీమలోని పలు ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులను, ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థల బస్సులను భారీగా వాడుకుంది. ఈ క్రమంలో ప్రైవేటు పాఠశాలలకు అప్రకటిత సెలవు అమలు చేసింది. ఇంత చేసి వేలాది మందిని తరలించినా.. సీఎం ప్రసంగం మొదలు కాగానే జారుకున్నారు. కొందరు బారికేడ్లను తోసుకుని వెళ్లారు. పోలీసులు అడ్డుకోవడంతో మరికొందరు బారికేడ్లను ఎక్కి దూకేశారు. దీంతో పోలీసులు చేతులెత్తేశారు. ఫలితంగా సీఎం సభలో ఖాళీ కుర్చీలు కనిపించాయి. ఎప్పటిలాగానే సభలో మీడియా, విపక్షాలపై జగన్ విమర్శలు గుప్పించారు. తనకు మీడియా, దత్తపుత్రుడి మద్దతు లేదని అన్నారు. పీసీసీ అధ్యక్షురాలు.. తన సోదరి షర్మిల, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సైతం చంద్రబాబుకు అండగా ఉన్నారని పరోక్ష విమర్శలు చేశారు. నాలుగో విడత వైఎస్సార్ ఆసరా కింద రూ.6,394.83 కోట్ల నిధులను విడుదల చేశారు. రానున్న 14 రోజుల పాటు పండుగ వాతావరణంలో పొదుపు సంఘాల మహిళలకు ఈ సొమ్ము అందిస్తామని అన్నారు. తాను బటన్ నొక్కినంత మాత్రాన.. ఇదే రోజు సొమ్ము జమకాదని పరోక్షంగా ఒప్పుకున్నారు. - వివరాలు మెయిన్, 5లో...

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేద్దాం: పయ్యావుల కేశవ్


కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఉరవకొండ, జనవరి 23: రా.. కదలిరా పేరుతో ఈనెల 27న ఉరవకొండలో జరగనున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. మండలంలోని కౌకుంట్ల గ్రామంలో మంగళవారం ఆయన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. చంద్రబాబు పర్యటనపై చర్చించారు. చంద్రబాబు సభను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని సూచించారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రావడం తథ్యమన్నారు. వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. రాబోవు 80రోజులు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, నూతేటి వెంకటేశులు, ప్రసాద్, మారయ్య, లాయర్ శీనా, మురళి, మారయ్య పాల్గొన్నారు.

తుది జాబితాలోనూ తప్పులే..!

చెన్నేకొత్తపల్లి, జనవరి 23: ఓటర్ల తుది జాబితాలోనూ తప్పులు కనిపిస్తున్నాయి. మృతుల పేర్లు కొన్ని అలాగే ఉన్నాయి. డబుల్ ఎంట్రీలనూ సరిచేయలేదు. కొందరు బతికే ఉన్నా.. జాబితా నుంచి తొలగించారు.

- చెన్నేకొత్తపల్లి పోలింగ్ కేంద్రం 249లో.. చిన్నవెంగన్నగారి గంగిరెడ్డి గత కొన్నేళ్ల క్రితం మృతిచెందారు. ఆయన పేరు జాబితాలో అలాగే ఉంది. కానీ ఆయన భార్య కాంతమ్మ బతికే ఉన్నా.. పేరును తొలగించారు.
- చెన్నేకొత్తపల్లి పోలింగ్ కేంద్రం 250లో రామకృష్ణ, భాగ్యలక్ష్మి దంపతులకు ఓట్లు ఉన్నాయి. వీరి పేర్లు ధర్మవరం రూరల్ మండలం పోతుకుంటలోని 155 పోలింగ్ కేంద్రం పరిధిలోనూ ఉన్నాయి.


బతికున్న కాంతమ్మ పేరును తొలగించి.. చనిపోయిన ఆమె భర్త గంగిరెడ్డి పేరును అలాగే ఉంచిన దృశ్యం

పతనం తప్పదని జగన్‌కు తెలిసిపోయింది

ప్రజల సానుభూతి కోసమే బేలమాటలు
పీఏసీ చైర్మన్ పయ్యావుల


మీడియాతో మాట్లాడుతున్న కేశవ్

అనంతపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో పతనం తప్పదని జగన్‌కు తెలిసిపోయిందని, అందుకే ప్రజల సానుభూతి కోసం బేలమాటలు మాట్లాడుతున్నాడని పీఏసీ చైర్మన్, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఎద్దేవా చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరితో కలిసి మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ అధినాయకుడు చంద్రబాబును తిడుతూ, ప్రజల పక్షాన నిలిచిన పత్రికల యాజమాన్యాలను దూషిస్తూ.. తనకు మీడియా లేదన్నట్లుగా, తనకుతాను ఒక బాధితుడనని అన్నట్లుగా జగన్ చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఒక ముఖ్యమంత్రి హోదాలో బేలగా, బలహీనంగా, చేతగాని వాడిలాగా జగన్ ఉరవకొండ సభలో మాట్లాడటం స్పష్టంగా కనిపించిందని అన్నారు. ప్రతిపక్షాలను కేసులతో ఇబ్బందులకు గురిచేసిన ఆయన, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇలా మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. రాజ్యాధికారం కోసమే జగన్ పనిచేశారని, ఆ అధికారం పోతుందన్న భయంతోనే అలా మాట్లాడుతున్నారని అన్నారు. ప్రజల కోసం పనిచేసి ఉంటే ఆ భయం ఉండేది కాదని అన్నారు. వైసీపీ పాలనలో బాధింపబడిన అన్ని వర్గాల ప్రజలు తమ పార్టీకి స్టార్ క్యాంపెయినర్లు అని కేశవ్ అన్నారు. నిత్యావసర ధరలు పెరగడంతో కుదేలైన సామాన్యులు, రైతులు, నిరుద్యోగులు, యువత, దళితులు, బీసీలు, ముస్లింలు, అంగన్‌వాడీలు, ప్రభుత్వ ఉద్యోగులు, ఖాకీ యూనిఫాం వేసుకొని మీ కోసం పనిచేసిన పోలీసు టోపీ కూడా తమ పార్టీకి స్టార్ క్యాంపెయినర్లు అవుతారని అన్నారు. వైసీపీకి దోపిడీదారులే బ్రాండ్ అంబాసిడర్లని ఎద్దేవా చేశారు.

ఇంకా ఏమేం అన్నారంటే..!.

నీరిచ్చారా..?

"జలదీక్షతో హంద్రీనీవా ద్వారా 8 వేల ఎకరాలకు నీరిస్తామని హామీ ఇచ్చారు. ఐదేళ్లలో కనీసం 8 ఎకరాలకైనా నీరిచ్చారా..? మీ ప్రభుత్వానికి మరో నెల రోజులే సమయం ఉంది. ఇప్పుడు వడివడిగా ఏం పనులు చేస్తారు..? టీడీపీ హయాంలో హంద్రీనీవా పనులు 50 శాతం పూర్తి చేశాం. మీ పాలనలో తట్టెడు మట్టిని కూడా తీయలేదు. ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం ఒక్క పరిశ్రమను తీసుకొచ్చారా? మూడున్నరేళ్ల డ్రిప్ పరికరాల సరఫరాను ఆపేసి, ఆ తర్వాత అరకొరగా ఇచ్చారు. ఉరవకొండ నియోజకవర్గంలో నేను చేసిన పనులు కళ్ల ముందు కనబడతాయి. సీఎం జగన్‌ను ఉరవకొండకు తీసుకువెళ్లిన డబుల్ రోడ్డును టీడీపీ హయాంలో నేనే వేయించాను. ఉరవకొండలో 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రిలాంటిది మరెక్కడా లేదు."

వసూళ్ల పక్షి విశ్వ

"విశ్వ వసూళ్ల పక్షి. అన్నింటిలోనూ వసూళ్లకు పాల్పడుతున్నారు. బీఫాం వస్తుందో రాదోనని తాపత్రయంతో ఆయన మాట్లాడుతున్నారు. ఇళ్ల స్థలాల కోసం వంద ఎకరాల భూసేకరణ నా పోరాట ఫలితమే. నేను దొంగ పట్టాలు ఇచ్చానని అబద్ధాలు చెప్పి పేద ప్రజలను మభ్యపెట్టాలని చూడటానికి సిగ్గుగా లేదా విశ్వా ? నిష్పక్షపాతంగా నేనిచ్చిన జాబితాను మార్చలేక జగన్ బొమ్మ వేయడం కోసం పట్టాలు మార్చారు. ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు దొంగ పట్టాలేనా..? చేతగాని దద్దమ్మ, అసమర్థుడు, ఉరవకొండ ప్రజానీకానికి నష్టం కలిగించిన వ్యక్తివి నువ్వు. రైతాంగానికి రూ.300 కోట్లు నష్టం కలిగించిన నీవు ఒక వైపు.. రూ.300 కోట్ల అభివృద్ధి పనులు చేసిన నేను ఒకవైపు ఉన్నాం. నాలుగున్నరేళ్లపాటు నిద్రపోయి.. ఎన్నికల ముందు జీడిపల్లి రైతులకు ఆర్‌అండ్‌ఆర్ ఇవ్వాలని, కాలువ పనులు చేయాలని మాట్లాడటం ఏమిటి..? ఇన్నాళ్లు నీ హంద్రీనీవా సాధన సమితి ఎక్కడికిపోయింది..? నీ కబ్జాల చరిత్ర గురించి ఉరవకొండలో కథలుకథలుగా చెప్పుకుంటున్నారు. టీడీపీ హయాంలో 500 మంది వైసీపీ కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ వచ్చింది. ఉరవకొండ ప్రజలే నాకు దేవుళ్లు. వారి కోసం ఎప్పటికీ పనిచేస్తూనే ఉంటా. మోసపూరిత మాటలతో ఎక్కువ కాలం ప్రజలను నమ్మించలేవని గుర్తుంచుకో విశ్వా..! నీ పతనం ఎప్పుడో నిర్ధారణ అయింది. నీ అసమర్థతను చూసి ఓట్లు వేసేందుకు ప్రజలు సిద్ధంగా లేరు.'



గుటగుటా..


పదండి పోదాం..

ఊపిరాడలేదు అన్నో..

ఐదేళ్లనాటి హామీలే.. తాజాగా..!

- హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీలకు నిధులట
- జీడిపల్లి పునర్నిర్మాణానికి రూ.88 కోట్లట
- ట్యాంకులు.. స్కూళ్లు.. ఇంకా చాలానే..!
- విశ్వ అడిగారు.. సీఎం సరేనన్నారు..!
- ఎన్నికల ముందు అయ్యే పనేనా ..?

అనంతపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఉట్టికి ఎగరలేనమ్మ స్వర్గానికెగిరిందంట. అట్లుంది సీఎం జగన్ హామీల అమలు తీరు. ఉరవకొండ బహిరంగ సభలో ఆయన మాటలు కోటలు దాటాయి. అధికారం చేపట్టింది మొదలు.. 56 నెలల పాలనలో అమలు చేయని హామీలను ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అమలు చేస్తానని అంటున్నారు. అందులో కొన్ని హామీలు ఐదేళ్ల క్రితం ఇచ్చినవే. ప్రతిపక్ష నేతహోదాలో ప్రతినబూని.. సీఎం హోదాలో పాలన దాదాపు పూర్తి చేసి.. మళ్లీ ఇప్పుడు అవే హామీలు ఇచ్చారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విశ్వేశ్వరరెడ్డి సీఎం దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లారు. అందుకు సీఎం సమ్మతించారు.


ప్రసంగిస్తున్న సీఎం జగన్

- ముంపునకు గురైన బెళుగుప్ప మండలం జీడిపల్లి గ్రామ పునర్నిర్మాణానికి చర్యలు వెంటనే చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ముంపు గ్రామాన్ని రూ.88 కోట్లతో ఆదుకుంటామని హామీ ఇచ్చారు.
- హంద్రీనీవా కింద 75 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు మిగిలిన డిస్ట్రిబ్యూటరీల నిర్మాణానికి రూ.68 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పెన్నహోబిళంలో బీసీ బాలుర రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి రూ.33 కోట్లు, ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల్లో 12 మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దాదాపు రూ.210 కోట్ల పనులకు ఆమోదం తెలిపారు.
- హామీలివ్వడం సీఎం జగన్‌కు కొత్తేమీ కాదు. ఈ జిల్లా మనవడినంటూ అనేక హామీలు ఇచ్చారు. ప్రతిపక్ష నేతగా హోదాలో ఉరవకొండలో జలదీక్ష చేశారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీలను పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. కానీ మరిచారు. మళ్లీ ఇప్పుడు అదే హామీ ఇచ్చారు.
- ఈ ఐదేళ్లలో ముఖ్యమంత్రి హోదాలో జగన్ అనేక సార్లు జిల్లాకు వచ్చారు. ప్రతిసారీ ఏదో ఒక పథకానికి బటన్ నొక్కారు. కానీ హామీల గురించి ప్రస్తావించడం లేదు. ప్రతి సభలోనూ విపక్షాలపై విమర్శలు గుప్పించి వెళుతున్నారు. కానీ తను ప్రతిపక్షంలో ఉండగా మాటిచ్చిన హెచ్చెల్సీ ఆధునికీకరణ, హంద్రీనీవా పెండింగ్ పనులు పూర్తి, హంద్రీనీవా విస్తరణ.. ఇలా వేటి గురించీ పట్టించుకోవడం లేదు. మాట తప్పను.. మడమ తిప్పనని చెప్పుకునే జగన్.. హామీలను గాలికొదిలేయడం మాట తప్పడం కాదా..? తాజాగా విశ్వేశ్వర రెడ్డి కోరిన వరాల పరిస్థితీ అంతేనని జనం నిట్టూరుస్తున్నారు.


సీఎం జగన్ సభలో ఖాళీ కుర్చీలు...


దివ్యాంగులకు అనుమతి లేదు..

31,306 సంఘాలకు లబ్ధి

నాలుగో విడత వైఎస్సార్ ఆసరా సొమ్మును సీఎం జగన్ బటన్ నొక్కి మహిళల ఖాతాల్లోకి జమ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళల ఖాతాల్లోకి రూ.6394.83 కోట్లు జమ చేస్తున్నామని ప్రకటించారు. ఇందులో జిల్లాకు చెందిన 31,306 సంఘాలలోని 3,08,150 మంది మహిళలకు రూ.236.94 కోట్ల లబ్ధి చేకూరనుంది.


బటన్ నొక్కి ఆసరా డబ్బు జమ చేస్తున్న జగన్

హెలిప్యాడ్ వద్ద కొందరికే...

ఉరవకొండ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద కొందరు వైసీపీ నేతలకు సీఎం జగన్ దర్శనం కాలేదు. కేవలం 25 మందికే ఆ అవకాశం దక్కింది. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, జెడ్పీ చైర్‌పర్సన్, రెండు జిల్లాల పార్టీ అధ్యక్షులను మాత్రమే సీఎంను కలిసేందుకు అనుమతిచ్చారు. ఈ క్రమంలో కొందరు ఎలాగోలా సీఎంను కలవాలని ప్రయత్నం చేశారు. ఇలా మొత్తం 25 మంది మాత్రమే సీఎంను కలిశారు. మిగిలిన వారికి అవకాశం దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. వీరిలో ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ పదవులు పొందిన నాయకులు ఉండటం గమనార్హం.

మంచినీరూ లేదు..!

గుంతకల్లు: ఆసరా బటన్ నొక్కుడు కార్యక్రమానికి రప్పించిన మహిళలు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉరవకొండ సభకు దాదాపు 30 వేల జనాన్ని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆర్టీసీ బస్సులు, విద్యాసంస్థల బస్సులను వాడుకున్నారు. ఉరవకొండ పట్టణం వెలుపలే బస్సులను నిలిపేశారు. దీంతో జనం దాదాపు 3 కి.మీ. దూరం నడిచి సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఆపసోపాలు పడుతూ వచ్చిన మహిళలకు సభలో కూర్చోవడానికి స్థలం లేక ఎండలో నిలబడ్డారు. బయట ఉన్నవారికి కనీసం తాగునీటి ప్యాకెట్లు కూడా ఇవ్వలేదు. ఎండ వేడిమికి నాలుకలు పిడచగట్టుకుపోయిన జనం.. నీటి కోసం దిక్కులు చూశారు. నీరు ఇచ్చేవారు లేకపోవడంతో ఐస్‌క్రీమ్ కొని తింటూ ఉపశమనం పొందారు. జగన్ ఉదయం 11-40 గంటల ప్రాంతంలో సభా స్థలానికి వచ్చారు. ఆయన వేదికపైకి ఎక్కగానే బయట ఉన్నవారు తిరుగు ప్రయాణంకట్టారు. ఆసరా డబ్బు కోసం మీటింగ్ వద్ద థంబ్ వేయాల్సి ఉంటుందని చెప్పి పొదుపు సంఘాల సభ్యులను బలవంతంగా సమావేశానికి తెచ్చారు. అడుగడుగునా నిలిచిన సీసీలు, మెప్మా సిబ్బంది పొదుపు సంఘాల మహిళలను సభ వద్దకు తరలించారు. జగన్ మాట్లాడక మునుపే బయట ఉన్న మహిళలు వెళ్లిపోగా, సభలోని వారు అరగంట గడవకనే లేచి వెళ్లిపోయారు. టీడీపీకి చెందిన పొదుపు మహిళలు సైతం సీఎం సమావేశానికి వచ్చారంటే.. వారిపై ఒత్తిళ్లు ఏమేరకు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.


జగన్ ప్రసంగా ప్రారంభం కాకనే వెళ్లిపోతున్న పొదుపు మహిళలు

ఎమ్మెల్సీ ఇక్బాల్‌కు చుక్కెదురు

వెంట వచ్చిన వారిని ఎయిర్‌పోర్టులోకి అనుమతించని అధికారులు.. ఆర్డీఓతో ఫోన్‌లో మాట్లాడినా ఫలితం శూన్యం


మీరొక్కరే వెళ్లండి సార్..

పుట్టపర్తి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి విమానాశ్రమంలో సీఎం జగన్‌కు వీడ్కోలు పలికేందుకు వచ్చిన ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్‌కు చుక్కెదురైంది. మంగళవారం సాయంత్రం పుట్టపర్తి విమానాశ్రమంలోకి వెళ్లేందుకు ఎమ్మెల్సీ ఇక్బాల్ వెంట హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైసీపీ నేతలు వచ్చారు. ఎమ్మెల్సీతోపాటు వారు కూడా లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. లిస్టులో పేరు లేని వైసీపీ నేతలతోపాటు ఎమ్మెల్సీని పోలీసులు అడ్డుకున్నారు. తాను ఎమ్మెల్సీననీ, మాజీ డీఐజీ కూడా అని చెప్పుకున్నా.. వినలేదు. ఎవరైతే ఏంటనీ, లిస్టులో పేరులేని వారిని అనుమతించేది లేదని తెగేసి చెప్పారు. చివరకు ఆర్డీఓ భాగ్యరేఖకు ఎమ్మెల్సీ ఇక్బాల్ ఫోన్ చేసి, వెంట వచ్చిన వారిని అనుమతించాలని విన్నవించారు. 'అమ్మా.. తల్లీ.. దుర్గామాత, కనికరించు తల్లీ.. మావాళ్లను పంపించు' అంటూ విన్నవించడం ఆశ్చర్యానికి లోనుచేసింది. లిస్టులో పేరు ఉన్న వారినే అనుమతిస్తామనీ, లేకుంటే అవకాశం లేదని ఆర్డీఓ నిరాకరించారు. అనుమతించకపోవడంతో ఎమ్మెల్సీ ఇక్బాల్ ఒంటరిగా సీఎంకి వీడ్కోలు పలికేందుకు వెళ్లగా.. వెంట వచ్చినవారు నిరాశతో వెనుదిరిగారు.

అనంత లఘుచిత్ర వారోత్సవాలు ప్రారంభం

అనంతపురం కల్చరల్, జనవరి 23 : అనంతపురం షార్ట్‌ఫిల్మ్ సొసైటీ, హెచ్‌డీ విజన్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల డ్రామా హాల్‌లో 6వ అనంత లఘుచిత్ర వారోత్సవాలను ప్రారంభించారు. సొసైటీ అధ్యక్షుడు రషీద్‌బాషా అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి, కంటివైద్య నిపుణులు డాక్టర్ అక్బర్ సాహెబ్ ముఖ్యఅతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రషీద్‌బాషా మాట్లాడుతూ... లఘుచిత్ర వారోత్సవాల్లో భాగంగా ఈనెల 26, 27 తేదీల్లో విద్యుత్‌నగర్-2 ప్రివ్యూ థియేటర్‌లో చిత్రాలను ప్రదర్శించి, విజేతలను ఎంపిక చేస్తామన్నారు. కంబదూరు షేక్ నబిరసూల్, తోట బాలన్న, కస్తూరప్ప, మురళీధరరావు, సుధాకర్, హసీనా, సూర్యనారాయణ, అనిల్‌కుమార్, కేవీ రమణ, విజయసాయికుమార్ యాంకర్ రమేష్ నీల్, జాకీర్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.


జ్యోతిప్రజ్వలన చేసి లఘుచిత్ర వారోత్సవాలను ప్రారంభిస్తున్న దృశ్యం

నేడు పరిటాల రవి వర్ధంతి

- వెంకటాపురానికి తరలిరానున్న అభిమానులు
- ఏర్పాట్లను పరిశీలించిన పరిటాల సునీత, శ్రీరామ్

రామగిరి, జనవరి 23: పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న దివంగత నేత మాజీ మంత్రి పరిటాల రవీంద్ర19వ వర్ధంతిని మండలంలోని వెంకటాపురంలో బుధవారం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి భారీగా అభిమానులు తరలిరానున్నారు. మంగళవారం మాజీ మంత్రి పరిటాలసునీత, పరిటాలశ్రీరామ్ కుటుంబసభ్యులతో కలిసి ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఏటా పరిటాల రవీంద్ర వర్ధంతి నాడు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పరిటాల రవి ఘాట్‌ను ప్రత్యేకంగా తెప్పించిన పూలతో అలంకరించనున్నారు. వేలాదిమందికి అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పరిటాల రవి కన్నుమూసి 19 ఏళ్లు అయినప్పటికీ ప్రజల గుండెల్లో ఆయనకు చెరగని స్థానం ఉందన్నారు. అందుకే ప్రతి ఏడాది అభిమానులు వేలాదిగా తరలివచ్చి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్నారన్నారు. ప్రజలు తమపై చూపిస్తున్న ప్రేమ వల్లతమపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. అభిమానుల రుణం తీర్చుకోలేనిదన్నారు.


వంట ఏర్పాట్లను పరిశీలిస్తున్న పరిటాలసునీత, శ్రీరామ్

ఈ ఏడాది రవీంద్ర వర్ధంతిని అన్నిమండల కేంద్రాల్లో నిర్వహించుకున్న తరువాత వెంకటాపురంకు రావాలని విజ్ఞప్తి చేశారు. వర్ధంతికి ఎన్ని వేలమంది తరలివచ్చినా ఎలాంటి అసౌకర్యం కల్గకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం పదేళ్లు వెనక్కి

- టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్



రామగిరి, జనవరి 23: వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం పదేళ్లు వెనక్కి వెళ్లిందని ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన వెంకటాపురంలోని తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ మరోసారి వైసీపీ వస్తే రాష్ట్రాన్ని ఎవరూ కాపాడలేరని, వీరి పాలనలో ఏ ఒక్కరూ బాగుపడలేదు కదా రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారన్నారు. అధిక ధరలతో ప్రజలను తీవ్ర నష్టాలకు గురిచేశారన్నారు. ఆర్టీసీ, విద్యుత్ చార్జీలు పెంచి చెత్తపై పన్నులు వేసిన చెత్త ఏకైక ముఖ్యమంత్రి జగనే అని ఆయన విమర్శించారు. టీడీపీ పాలనలో ఏ రోజూ విద్యుత్ చార్జీలు పెంచలేదని, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేశామన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పండుగలకు కానుకలు ఇచ్చేవారని, ఈ ప్రభుత్వంలో అలాంటివి ఏమీలేవని మండిపడ్డారు. మద్యపాన నిషేధమంటూ ప్రగల్భాలు పలికి నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. ప్రజల్లో నమ్మకం కోల్పోయిన జగన్ ఇప్పుడు ఎమ్మెల్యేలను మారుస్తున్నారన్నారు. అది కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీలపై మాత్రమే వేటు వేస్తున్నారని, ప్రజలు సీఎంను మార్చాలని ఇప్పటికే నిర్ణయించుకున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే అభివృద్ధి, సంక్షేమం అంటే ఏమిటో చూపిస్తామన్నారు.


అయోధ్యకు ప్రత్యేక రైళ్లు

రాయదుర్గం, జనవరి 23: అయోధ్యలో బాలరాముడి దర్శనార్థం వెళ్లే భక్తుల దర్శనార్థం రాయదుర్గం మీదుగా నైరుతి రైల్వే ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ బీఎల్ శివకుమార్ మంగళవారం ప్రకటించారు. బెంగుళూరు నుంచి 06201 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలు జనవరి 31, ఫిబ్రవరి 14, 28 తేదీల్లో బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు బయలుదేరి మ ధ్యాహ్నం 12.30కు రాయదుర్గం చేరుకుని శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు అయోధ్యకు చేరుకుంటుంది. శనివారం రాత్రి 7.20కు అయోధ్యలో బయలుదేరి సోమవారం రాత్రి 8 గంటలకు రాయదుర్గం చేరుకుని మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు బెంగుళూరుకు చేరుకుంటుంది. మైసూరు నుంచి అయోధ్యకు 06202 నంబరు గల రైలు ఫిబ్రవరి 4, 18వ తేదీల్లో ఆదివారం రాత్రి 12.32 మైసూరులో బయలుదేరి రాయదుర్గంకు మధ్యాహ్నం 12.30కు చేరుకుని మంగళ వారం మధ్యాహ్నం ఒంటిగంటకు అయోధ్యకు చేరుకుంటుంది. బుధవారం రాత్రి 7.20 కు బయలుదేరి శుక్రవారం రాత్రి 8 గంటలకు రాయదుర్గం మీదుగా శనివారం ఉదయం 7 గంటలకు మైసూరుకు చేరుకుంటుంది. టుంకూరు నుంచి అయోధ్య 06203 నంబరు రైలు ఫిబ్రవరి 7, 21 తేదీలలో గురువారం టుంకూరులో తెల్లవారుజామున 5.20 బయలుదేరి మధ్యాహ్నం 12.30 గంటలకు రాయదుర్గం కు చేరుకుని శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంటకు అయోధ్యకు చేరుకుంటుంది. శనివారం రాత్రి 7.20 గంటలకు అయోధ్యలో బయలుదేరి సోమవారం రాత్రి 8 గంటలకు రాయదుర్గం చేరుకుని శని వారం అర్ధరాత్రి 1.20 గంటలకు టుంకూరుకు చేరుకుంటుంది. చిత్రదుర్గం నుంచి అయోధ్యకు 06204 నంబరు గల రైలు చిత్రదుర్గంలో ఫిబ్రవరి 11, 25 వ తేదీలలో ఆదివారం రాత్రి 10.20 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు రాయదుర్గం చేరుకుని మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు అయోధ్యకు చేరుకుంటుంది. అయోధ్యలో బుధవారం రాత్రి 7.20కు బయలుదేరి శుక్రవారం రాత్రి 8 గంటలకు రాయదుర్గంకు చేరుకుని 10.20 గంటలకు చిత్రదుర్గంకు చేరుకుంటుంది. మైసూరు నుంచి అయోధ్య కు 06206 నంబరు గల రైలు మైసూరు నుంచి ఫిబ్రవరి 17 న శనివారం తెల్లవారుజామున 3 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1 గంటకు రాయదుర్గంకు చేరుకుని సోమవారం ఒంటిగంటకు అయోధ్యకు చే రుకుంటుంది. మంగళవారం అయోధ్యలో రాత్రి 7.20కు బయలుదేరి గురువారం సాయంత్రం 6 గంటలకు రాయదుర్గంకు చేరుకుని శుక్రవారం తెల్లవారుజామున 3.20 గంటలకు మైసూరుకు చేరుకుంటుంది. ప్రత్యేక రైళ్ల సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

అర్జీలిస్తామంటే... అరెస్టు చేస్తారా..?

- సీఎం పర్యటనకు వెళ్తున్న సీపీఐ, యూటీఎఫ్ నాయకులను అడ్డుకోవడంపై నేతల మండిపాటు


సీపీఐ జాఫర్ మెడపై గాయాలు


వజ్రకరూరు పోలీస్‌స్టేషన్‌లో జాఫర్, ఇతర నేతలు

అనంతపురం విద్య, జనవరి 23 : రైతుల, కూలీలు, కార్మికుల సమస్యలపై అర్జీలిచ్చేందుకు వెళ్తుంటే అరెస్టులు చేసి అడ్డుకుంటారా అని సీపీఐ నాయకులు మండిపడ్డారు. ఉరవకొండలో సీఎం పర్యటన నేపథ్యంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి నారాయణస్వామి, ఏపీ రైతు సంఘం నేతలు ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు మల్లికార్జున, కేశవరెడ్డి మనోహర్, కుళ్లాయిస్వామి, సంతోష్, ఆ నంద్, మోహన్ ఉరవకొండకు వెళ్తుండగా పలు ప్రాంతాల్లో పోలీసులు అడ్డుకుని వజ్రకరూరు, ఇతర పోలీస్‌స్టేషన్లకు తరలించారు. పోలీసుల తోపులాటలో జాఫర్‌కు గాయాలయ్యాయి. మరికొందరిని నగర శివారు ప్రాంతాల్లోనే నిలువరించారు. అరెస్ట్‌లపై జాఫర్, నారాయణస్వామి మాట్లాడుతూ... జగన్ ప్రభుత్వం రైతులు, నిరుద్యోగులు, కార్మికులు, విద్యార్థుల సంక్షేమం పట్టకుండా వ్యవహరిస్తోందంటూ...మండిపడ్డారు. జిల్లాలో తీవ్ర కరువు నేపథ్యంలో ప్రజలు అన్నమోరామచంద్ర అంటున్నారన్నారు. గత నెల 12న కరువు బృం దాలు పర్యటించినా.... ఇప్పటి వరకూ రైతులను ఆదుకోవడానికి సర్కారు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో సుమారు 30 వేల ఎకరాల్లో పంటలు సాగుచేశారని, అయితే జీబీసీకి నీళ్ల రాక..అన్నదాతలు ఆవేదన చెందుతున్నారన్నారు. ప్ర భుత్వం స్పందించి 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కోరారు. లేకపోతే రెతులకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు.

యూటీఎఫ్ నేతలూ స్టేషన్‌కే...

యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్పచౌదరి, జిల్లా కార్యదర్శి సంజీవ్‌కుమార్, జిల్లా కౌన్సిలర్లు నాగరాజును సీఎం పర్యటన నేపథ్యంలో తెల్లవారుజామునే ఉరవకొండ పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. దీనిపై ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్షులు గోవిందరాజు, ప్రధానకార్యదర్శి లింగమయ్య, ఇతర నేతలు మండిపడ్డారు. సీఎం ఎక్కడికి వెళ్లినా యూటీఎఫ్ నేతలను అరెస్టు చేయడం దారుణం అన్నారు. ఉపాధ్యాయులపై అణచివేత ధోరణి సరికాదన్నారు.


పోలీస్‌స్టేషన్‌లో యూటీఎఫ్ నేతలు

తిరుపతికి ప్రత్యేక రైలు

గుంతకల్లు, జనవరి23: ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ (వయా గుంతకల్లు) మధ్య రెండు ట్రిప్పుల ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్-తిరుపతి (నెం. 07041) రైలు సికింద్రాబాద్‌లో ఈ నెల 25వ తేదీన గురువారం రాత్రి 8 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు తిరుపతికి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 07042) ఈనెల 26వ తేదీ శుక్రవారం సాయంత్రం 7-50 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం తొమ్మిదిన్నరకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చెర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, గుంతకల్లు, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.


వెంకటాపురంలో కేక్‌కట్ చేస్తున్న పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్


బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న వైకుంఠం ప్రభాకర్ చౌదరి


టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి ఆధ్వర్యంలో..


గూగూడులో కేక్ కట్ చేస్తున్న ఆలం నరసానాయుడు

ఘనంగా లోకేశ్ జన్మదినం

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ జన్మదిన వేడుకలను పలు ప్రాంతాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వగ్రామమైన వెంకటాపురంలో మాజీ మంత్రి పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను టీడీపీ నాయకులు జరుపుకున్నారు. పరిటాల సునీత తన మనవరాలితో కేక్‌కట్ చేయించారు. అనంతపురం నగరంతో పాటు పలు ప్రాంతాల్లో టీడీపీ నాయకులు కేక్‌లు కట్ చేశారు.

బైక్ ర్యాలీ : నారాలోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకొని అనంతపురంలో మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహం ఎదుట వైకుంఠం మధుకర్ చౌదరి పార్టీ శ్రేణులు, యువతతో కలిసి భారీ కేక్ కట్ చేశారు.


కేక్ కట్ చేస్తున్న విశాలాక్షి, పోతులయ్య, వడ్డే వెంకట్


అనంతపురంలో కేక్ కట్ చేస్తున్న దండు శ్రీనివాసులు, టీడీపీ నాయకులు


అనంతపురం అంబేద్కర్ నగర్‌లోని మహాత్మాగాంధీ స్కూల్‌లో కేక్ కట్ చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు


అర్బన్‌బ్యాంకులో చైర్మన్ జేఎల్ మురళీధర్, నాయకుడు గద్దం సుబ్రహ్మణ్యం


మానసిక వికలాంగ పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న గౌస్‌మొహిద్దీన్


అనాథాశ్రమంలో కేఎం జకీవుల్లా, రాయల్ మురళి



పెద్దాస్పత్రి వద్ద అన్నదానం చేస్తున్న గద్దం సుబ్రహ్మణ్యం, గాజుల ఆదెన్న, నారాలోకేశ్ ట్రస్ట్ నిర్వాహకుడు కొత్తకోట కాశీం



బీకేఎస్‌లో కేక్ కట్ చేస్తున్న ముంటిమడుగు కేశవరెడ్డి, రామలింగారెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల హనుమంతరెడ్డి


ఆత్మకూరు టీడీపీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న శ్రీనివాసులు, నారాయణస్వామి


కారును విడుదల చేస్తున్న సంస్థ సీఈఓ ఆదిత్య మాచాని, బ్యాంకర్లు

మార్కెట్‌లోకి మహీంద్రా ఎక్స్‌యూవీ కారు

అనంతపురంరూరల్ : నగర శివారుల్లోని ఎంజీబీ మొబైల్స్ షోరంలో ఎంజీబీ మొబైల్స్ ఆధ్వర్యంలో మహీంద్రా ఎక్స్‌యూవీ 400 ఈఎల్ ప్రో కొత్త మోడల్ కారును మంగళవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. సంస్థ సీఈఓ మాచాని ఆదిత్య, బ్యాంకర్లు ఆ కారును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఈఓ మాచాని ఆదిత్య మాట్లాడుతూ.. ఎక్స్‌షోరూం ప్రారంభ ధర రూ.15.99 లక్షలన్నారు. కార్యక్రమంలో వినియోగదారులు, సంస్థసేవా విభాగం జీఎం రామకృష్ణ, అమ్మకం విభాగం జీఎం వంశీకృష్ణ, సేల్స్ మేనేజర్ మస్తాన్ వలీఖాన్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు

అనంతపురంరూరల్ : జిల్లాలోని గుత్తి మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణ చౌదరి మంగళవారం తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.7,020తో కొనుగోలు చేస్తుందని, రైతులు తమ పంటను మార్కెట్ యార్డులో విక్రయించుకోవచ్చని తెలిపారు.

రాగే సూర్యప్రసాద్‌కు బాల పురస్కార్


రాగే సూర్యప్రసాద్‌కు అవార్డు అందజేస్తున్న రాష్ట్రపతి

అనంతపురం క్లాక్‌టవర్: స్థానిక అశోక్‌నగర్‌కు చెందిన రాగే శివప్రసాద్, ప్రమీల కుమారుడు రాగే సూర్యప్రసాద్‌కు జాతీయ ప్రధానమంత్రి బాల పురస్కార్ దక్కిం ది. తొమ్మిదేళ్ల రాగే సూర్య ప్రసాద్ సౌతా ఫ్రికా టాంజానియలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించినందుకు ఈ అవార్డు దక్కింది. సోమవారం ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఆ అవార్డును రాగే సూర్యప్రసాద్‌కు అందజేశారు.

టీడీపీ నాయకుడికి నివాళి

శింగనమల, జనవరి 23: మండలంలోని ఏకుల నాగేపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కోటిరెడ్డి తండ్రి రోసిరెడ్డి అనారోగ్యంతో మంగళవారం మరణిం చాడు. ఆయన మృతదేహానికి ద్విసభ్యకమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీ రామలింగారెడ్డి, టీడీపీ నాయకులు గంగాధర్, కుళ్లాయప్ప, ఆదినారాయణ బండిపరుసురాం నారాయణస్వామి నివాళులర్పించారు.

జాతీయ రెజ్లింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్‌డీఓ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 23: కాకినాడలో ఈనెల 21, 22న నిర్వహించిన 10వ ఏపీ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభచాటి పది మంది జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాకు చెందిన అల్లీషా, కత్రిమల, సునీల్, నవీన్, తరుణ్, స్రవంతి బంగారు పతకాలు, తేజస్విని, జాఫర్‌ఆలీ, మహేష్‌బాబు, సంతోష్‌కుమార్ రజత పతకాలు సాధించారు. వీరు ఈనెల 30, 31న మహారాష్ట్రలోని పూణెలో జరిగే జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొంటారు. వీరిని స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో డీఎస్‌డీఓ నరసింహారెడ్డి, రెజ్లింగ్ అసోసియేషన్ అడహాక్ జిల్లా కార్యదర్శి జాఫర్ ఆలీ, సభ్యులు కార్తీక్, పవన్ మంగళవారం అభినందించారు.

నేలపాలు


నాగులగుడ్డం తండాలో గడ్డ కట్టిన పాల ప్యాకెట్లు

శింగనమల, జనవరి 23: అంగన్‌వాడీలు సమ్మెలో ఉన్న సమయంలో సచివాలయ సిబ్బందికి ప్రభుత్వం ఆ విధులను అప్పగించింది. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తు న్నామని, సమస్యే లేదన్నట్లుగా వ్యవహరించింది. కానీ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మె విరమించి.. విధులకు వెళితేగానీ డొల్లతనం బయట పడలేదు. నాగులగుడ్డం తండా అంగన్‌వాడీ కేంద్రంలో పాల ప్యాకెట్లు చెడిపోయాయి. తలుపులు తెరవగానే దుర్వాసన రావడంతో అంగన్‌వాడీ కార్యకర్త చెడిపోయిన పాలను బయట పడేశారు. శింగనమల ప్రాజెక్ట్ పరిధిలోని శింగనమల, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె అంగన్‌వాడీ కేంద్రాల్లో చాలాచోట్ల ఇదే పరిస్థితి కనిపించింది. కొందరు కార్యకర్తలు ఐసీడీఎస్ అధికారులకు దీనిపై సమాచారం ఇచ్చారు. విషయం బయటికి రాకుండా పాల ప్యాకెట్లను బయట పడేయాలని అధికారులు సూచించినట్లు సమాచారం.

ఎలక్ట్రీషియన్స్ డేను జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, జనవరి 23: ఎలక్ట్రీషియన్స్ డేను స్థానిక మూడో రోడ్డులోని వరసిద్ధి వినాయక ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహిస్తున్నట్లు ఏపీ ప్రైవేట్ ఎలక్ట్రికల్, ప్లంబర్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు బీఎస్ రవికుమార్, ప్రధాన కార్యదర్శి నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎలక్ట్రికల్ షాపుల యజమానులందరూ కార్యక్రమంలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

అనంతపురంరూరల్, జనవరి 23: మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పుల్లయ్య మంగళవారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలన్నారు.

రేకులకుంటలో కిసాన్‌మేళా

బుక్కరాయసముద్రం: మండలంలోని రేకులకుంటలోని ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రంలో కిసాన్ మేళా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందులో ఆచార్య ఎన్జీ వ్యవసాయ రంగా విశ్వవిద్యాలయం ఉపకులపతి శారదా జయలక్ష్మి, ప్రధాన పరిశోధన సంచాలకుడు డాక్టర్ ప్రశాంతి మాట్లాడారు. వాతావరణ పరిస్థితుల అనుగుణంగా పంటల మార్పిడి, సమగ్ర వ్యవసాయం, పోషక ధాన్యాలు, యాంత్రీకరణ వ్యవసాయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్సన్ రాష్ట్ర విస్తరణ సంచాలకుడు సుబ్బిరామిరెడ్డి, నంద్యాల ప్రధాన శాస్త్రవేత్తలు ఏడీఆర్ వెంకటేశ్వర్లు, సహదేవరెడ్డి, శాస్త్రవేత్తలు పద్మలత, సంపత్‌కుమార్, మల్లీశ్వరీ, నటరాజన్, అశోక్, పవన్‌కుమార్ రెడ్డి, జిల్లా శాస్త్రవేత్తలు, రైతులు, వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య అధికారులు పాల్గొన్నారు.

జగన్ ... అక్కచెల్లెమ్మలు నిన్ను నమ్మరు :జనసేన

అనంతపురం ప్రెస్‌క్లబ్ : జగన్... అక్కచెల్లెమ్మలు నిన్ను నమ్మే పరిస్థితి ఇక లేదని జనసేన పార్టీ కార్యనిర్వహణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి భవానీ రవికుమార్ అన్నారు. మంగళవారం ఆయన ఆ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ... అంగన్‌వాడీలకు తెలంగాణలో కంటే రూ.1000 వేతనం పెంచుతానని, మద్యాన్ని నిషేధిస్తానని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏ మయ్యాయని ప్రశ్నించారు.

జూదరుల అరెస్ట్.. రూ.6.54 లక్షలు స్వాధీనం

అనంతపురం క్రైం: నగర శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని అనంతపురం రూరల్ పోలీసులు మంగళవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు అనంతపురం రూరల్ సీఐ రామక్రిష్ణారెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.6.54 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

హెడ్‌నర్సులకు ఉద్యోగోన్నతులు

అనంతపురం టౌన్ : జిల్లా సర్వజన ఆస్పత్రిలోని నలుగురు హెడ్ నర్సులకు గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్లుగా ఉద్యోగోన్నతులు లభించాయని అనంత ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ మంజుల తెలిపారు. వారిలో ఏ.పద్మావతి, భూదేవి, పార్వతి, బీ.పద్మావతి ఉన్నారన్నారు.

చెస్ పోటీల్లో జిల్లాకు పతకాలు


మొదటి స్థానం సాధించిన క్రీడాకారులతో కోచ్

అనంతపురం క్లాక్‌టవర్ : కర్నూలులో ఆది, సోమవారాల్లో నిర్వహించిన ఏపీ రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ పోటీల్లో జిల్లాకు పలు పతకాలు దక్కాయి. నగరా నికి చెందిన సూపర్ కింగ్స్ చెస్ అకాడమీ క్రీడాకారులు అండర్-9 విభాగంలో సాకేత్ మొదటిస్థానం, బాలికల విభాగంలో ఆరాధ్య ద్వితీయ స్థానం, అండర్-11 బాలికల విభాగంలో అభిజ్ఞ ద్వితీయ స్థానం, అండర్-13 బాలికల విభాగంలో అనన్య తృతీయ స్థానం, త్రిపాద నాలుగో స్థానం, అండర్-15 బాలుర విభాగంలో ఆదిత్య ద్వితీయ స్థానం సాధించారు. ప్లేయర్ ఆఫ్ టోర్నీగా శివాన్ష్ నిలిచాడు. విజేతలను సూపర్ కింగ్స్ చెస్ అకాడమీ చీఫ్ కోచ్ మజీద్‌ఖాన్, ఆర్బిటార్ హుస్సేన్‌ఖాన్ అభినందించారు.

మహిళా సదస్సును జయప్రదం చేయండి

గార్లదిన్నె: అనంతపురంలో గురువారం నిర్వహించే మహిళా సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వాతంత్ర్యకుమారి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎమ్మార్పీఎస్ మహిళలు, నాయకులతో కలిసి ఆ సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆమె మాట్లాడారు. దిశ చట్టం కేవలం పేపర్లకే పరిమితమైందన్నారు.

దక్షిణ భారత దేశ చెస్ పోటీలకు మెడికో దీపక్

అనంతపురం టౌన్ : దక్షిణ భారత దేశ చెస్ పోటీలకు అనంత మెడికల్ కళాశాల ప్రథమ సంవత్సర వైద్యవిద్యార్థి దీపక్ ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు తెలిపారు. ఈనెల 26 నుంచి 28 వరకు తిరుచాపల్లి బారతీదాసన్ యూనివర్సిటీలో దక్షిణ భారత దేశ అంతర విశ్వవిద్యాలయాల చెస్ పోటీల్లో దీపక్ పాల్గొంటారన్నారు.

అరెస్టు అన్యాయం

అనంతపురంరూరల్ : ఎమ్మార్పీఎస్ నేతలకు చెందిన భూ సమస్య పరిష్కరించాలని కోరుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డిని కలిసేందుకు వెళ్తున్న తమను పోలీసులు అరెస్టు చేసి కూడేరు స్టేషన్‌లో ఉంచడం అన్యాయమని బీసీఆర్ దాస్ మంగళవారం వాపోయారు. కురుగుంట గ్రామ సర్వే నెంబరు 41లో రికార్డుల మేరకు ప్రకారం భూమిని సర్వే చేసి స్థలాలు చూపిస్తామని ఆర్డీఓ, తహసీల్దార్ చెప్పారని, ఇంత వరకు సర్వే చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. సమస్యను విన్నవించుకునేందుకు వెళ్తున్న తమను అరెస్టు చేయడం ఎంతవరకు న్యాయమన్నారు. ఆయన వెంట శివయ్య, రామాంజిన, కదిరప్ప, రామాంజినేయులు, రెడ్డప్ప, నాగభూషణ, రాజు, రాము, చైతన్య ఉన్నారు.

కాశీవిశ్వేశ్వరాలయాన్ని సందర్శించిన
గోవిందానంద సరస్వతి స్వామి


స్వామికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

అనంతపురం కల్చరల్, జనవరి 23: స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయాన్ని కర్ణాటక రాష్ట్రం తలకాడులోని బాలకృష్ణానంద మహాసంస్థానాధిపతి గోవిందానంద సరస్వతి స్వామి మంగళవారం సందర్శించారు. తలకాడు నుంచి హైదరాబాద్ వెళ్తున్న స్వామి మార్గమధ్యలో ఈ ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు స్వామికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ ఆవరణంలో భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. అనంతరం స్వామి హైదరాబాద్ వెళ్లారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, ధర్మకర్తల మండలి సభ్యులు వెంకటస్వామి, సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఏఐసీటీఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

అనంతపురం సెంట్రల్, జనవరి 23: బీబీఏ, బీసీఏ, బీఎంసీ కోర్సులను ఏఐసీటీఈ సంస్థ తన పరిధిలోకి తీసుకుంటూ ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యజమానుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘ సభ్యులు ఎస్కేయూ పరిపాలన భవనం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. డిగ్రీలో ప్రవేశాల శాతం పూర్తిగా పడిపోయి కళాశాలల భవిష్యత్తును ప్రశార్థకంగా మారిందని, ఈ తరుణంలో ఏఐసీటీఈ సంస్థ విధించిన నిబంధనలు మూలిగేనక్కపై తాటికాయ పడిన చందంగా ఉందని వాపోయారు. అనంతరం రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రెసిడెంట్ శుభాకర్‌రెడ్డి, సెక్రెటరీ రిజ్వాన్‌బాషా, జాయింట్ సెక్రెటరీ భక్తవత్సలం, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా నల్లలమ్మ జాతర

గార్లదిన్నె: మండలంలోని కనుంపల్లి గ్రామంలో నల్లలమ్మ, పెద్దమ్మ జాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. జాతర సందర్భంగా సోమవారం రాత్రి జ్యోతులు కార్యక్రమం నిర్వహించారు. జాతరను తిలకించేందుకు జిల్లా నలుమూలలు నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి, గేటు క్రిష్ణారెడ్డి, రామలింగారెడ్డి, దండు శ్రీనివాసులు, పుల్లన్న, వడ్డేవన్నూర్, సుంకన్న నల్లలమ్మ, పెద్దమ్మ అమ్మవార్లను దర్శించుకున్నారు. గ్రామంలో పండుగ వాతావరణ నెలకొంది.

జగన్ చేతకానితనంతోనే విమర్శలు: బీజేపీ

అనంతపురం సెంట్రల్ : జగన్ అసమర్థత, చేతగానితనం వల్లే తమ పార్టీపై విమర్శలు చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. రాష్ట్రలో ప్రజాసంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.వేల కోట్లు మంజూరు చేస్తోందన్నారు. బీజేపీని చంద్రబాబు కోసం తలదాచుకున్న పసుపు కమాలాలని విమర్శించడం ఆయన చేతగాని తనానికి నిదర్శమన్నారు. ఆ వాఖ్యలను వెనక్కి తీసుకోకపోతే తీవ్రపరిణామాలు తప్పవని హెచ్చరించారు.


ఉన్నం క్యాంప్ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద పుట్టిన రోజు వేడుకల సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం


గుంతకల్లులో జితేంద్రగౌడుకు మిఠాయిని తినిపిస్తున్న టీడీపీ నాయకులు


కళ్యాణదుర్గంలోని ఎన్టీఆర్ భవన్ వద్ద కేక్ కట్ చేస్తున్న ఉమామహేశ్వరనాయుడు


తాడిపత్రిలో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు


గుత్తిలో కేక్‌ను కట్ చేస్తున్న వెంకటశివుడు యాదవ్


నారా లోకేశ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బొమ్మనహాళ్ తెలుగు యువత


రాయదుర్గంలో జడ్పీ మాజీ చైర్మన్ పూల నాగరాజుకు కేకు తినిపిస్తున్న నాయకులు

ఘనంగా లోకేశ్ పుట్టిన రోజు

టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ పుట్టిన రోజు వేడుకలను ఆ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడు తన క్యాంపు కార్యాలయంలో లోకేశ్ బర్త్‌డే కేక్‌ను కట్‌చేశారు. కళ్యాణదుర్గంలోని తన క్యాంప్ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం హనుమంతరాయచౌదరి, ఎన్టీఆర్ భవన్‌లో ఆ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వర నాయుడు బర్త్‌డే వేడుకలు నిర్వహించారు. తాడిపత్రిలో టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీ మల్లికార్జున ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. గుత్తిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు స్వగృహంలో లోకేశ్ పుట్టినరోజు నిర్వహించారు. గుంతకల్లులో టీడీపీ సీనియర్ నాయకుడు పెరుమాళ్ల జీవానందరెడ్డి స్వగృహంలో జన్మదిన వేడుకలు చేశారు. రాయదుర్గం టీడీపీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజుతో పాటు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ నేతృత్వంలో కేక్ కట్ చేశారు. వినాయకసర్కిల్‌లో జడ్పీ మాజీ చైర్మన్ పూల నాగరాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్


గుంతకల్లులో కేక్‌ను కట్ చేస్తున్న పెరుమాళ్ల జీవానందరెడ్డి

వైసీపీ అరాచకపాలనపై తిరగబడదాం: ఉమా


కరపత్రాలను అందజేస్తున్న ఉమామహేశ్వరనాయుడు

కళ్యాణదుర్గం, జనవరి 23: వైసీపీ అరాచకపాలనపై ప్రతిఒక్కరు తిరగబడాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం మల్లాపురం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంచుతూ టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమష్టిగా వైసీపీ అరాచకాలపై పోరాడాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానం చేసి.. ప్రాణదాతలు కండి


సర్టిఫికెట్లు చూపుతున్న రక్తదాతలతో వాల్మీకి రాము

గుంతకల్లు టౌన్, జనవరి 23: ప్రాణపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు వాల్మీకి రాము పేర్కొన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం బస్టాండ్ సమీపంలోని పెట్రోల్ బంక్ ఎదురుగా వాల్మీకి రాము ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముందుగా కేక్‌ను కట్ చేశారు. 133 మంది రక్తదానం చేశారు. వీరికి సర్టిఫికెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు ఈశ్వర్, ఎర్రిస్వామి, ప్రశాంత్, భాస్కర్, మల్లేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం

కళ్యాణదుర్గం, జనవరి 23: ఇంటింటా కాంగ్రెస్ ప్రచారాన్ని ఆ పార్టీ నాయకులతో కలిసి నిర్వహించారు. మంగళవారం పీసీసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కంబదూరు, ఒంటారెడ్డిపల్లి, జెల్లిపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారాన్ని చేపట్టారు. 2024 ఎన్నికల్లో రఘువీరారెడ్డిని గెలిపించుకుని కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకుందామని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులను కృష్ణ జలాలతో నింపడం, ఏపీఐఐసీకి కేటాయించిన భూముల్లో పరిశ్రమలను తీసుకుని వచ్చి ఉద్యోగాలు కల్పించడం వంటి అనేక కార్యక్రమాలు రఘువీరారెడ్డితోనే సాధ్యమవుతాని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి, కరీంసాబ్, బలరాం, మండల కన్వీనర్లు ఈరన్న, మల్లయ్య, నాగరాజు, మధు, రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతాంగానికి నీరిచ్చి .. ఆదుకున్నది కాంగ్రెస్సే


విలేకరులతో మాట్లాడుతున్న శైలజానాథ్

కళ్యాణదుర్గం రూరల్, జనవరి 23: జిల్లా రైతాంగానికి నీరు ఇచ్చి ఆదుకున్న ఘనత కాంగ్రెస్ పార్టీదే అని మాజీ పీసీసీ చీఫ్ సాకే శైలజానాథ్ అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రఘువీరారెడ్డి, తాను మంత్రులుగా ఉన్న సమయంలో కృష్ణా జలాలను జిల్లాకు తీసుకువచ్చి సస్యశ్యామలం చేశామన్నారు. కానీ నేడు జిల్లాలో ఉన్న నీటి ప్రాజెక్టులు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాయలసీమ జిల్లాలకు రావాల్సిన నీటి వాటాపై నూతన పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన షర్మిలకి విన్నవించుకుందామని తెలిపారు. ఈ నెల 28న పీసీసీ చీఫ్ షర్మిల అనంతపురం వస్తున్నారని ఆ సభను జయప్రదం చేయాలని కోరారు.

పత్తి కొనుగోలులో ప్రభుత్వం విఫలం

- గిట్టుబాటు ధర కల్పించాలి
- తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి
- గుత్తి మార్కెట్‌యార్డ్, టోల్‌ప్లాజా వద్ద ధర్నా


గుత్తిలో మార్కెట్ యార్డులో ధర్నా చేస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి, రైతులు

గుత్తి/ పెద్దవడుగూరు, జనవరి 23: రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. పత్తి, మిరప సాగు చేసిన పెద్దవడుగూరు మండల రైతులతో కలిసి ఆయన మంగళవారం గుత్తి మార్కెట్ యార్డు వద్ద ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా పత్తి, మిరప పంటలు భారీగా దెబ్బతిన్నాయన్నారు. ఈక్రమంలో అరకొరగా పండిన పత్తికి ధర లేకపోవడంతో కోత కోసి ఇళ్లలో ఉంచుకున్నారన్నారు. 20రోజుల కిందట పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ 44వ జాతీయ రహదారిని దిగ్బంధం చేశామన్నారు. దీంతో ప్రజా ప్రతినిధులు జిల్లా కేంద్రంలో మార్కెట్ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి ఐదు రోజుల్లో పత్తిని కొనుగోలు చేస్తామని కరపత్రాలను విడుదల చేశారన్నారు. అయితే ఇంత వరకు పత్తిని కొనుగోలు చేయలేదన్నారు. పత్తిని ప్రభుత్వం కొనుగోలు చేయకపోతే రైతులకు ఆత్మహత్యలే శరణ్యం అవుతాయని మండిపడ్డారు. సీసీఐ వెంటనే పత్తిని కొనుగోలు చేయదు కాబట్టి నిబంధనలను సడలించి, గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనాలని డిమాండ్ చేశారు. జిల్లా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రిని కలిసి ఎంపీ, ఎమ్మెల్యేలు సమస్యను వివరించాలని సూచించారు. అనంతరం అక్కడి నుంచి 44వ జాతీయ రహదారిపై కాశేపల్లి టోల్‌గేట్ వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఓ ఎమ్మెల్సీ వాహనాన్ని టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో దాదాపు కిలో మీటర్ మేర వాహనాల రాకపోకలు స్తంభించాయి. రైతులు సీఎం డౌన్ డౌన్, చేతగాని ఎమ్మెల్యే, ఎంపీలు అంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

సీఎం పర్యటన నేపథ్యం.. ముందస్తు అరెస్టులు


గుంతకల్లు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీపీఐ, సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్/కణేకల్లు/ రాయదుర్గం రూరల్/ఉరవకొండ, జనవరి 23: ముఖ్యమంత్రి జగన్ ఉరవకొండ పర్యటన నేపథ్యంలో టీడీపీ నాయకులు, టీఎన్ఎస్ఎఫ్, కులసంఘాల నాయకులు, సీపీఐ, సీపీఎం నాయకులను పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఉరవకొండలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు భరత్, సుధాకర్, ఎస్సీ ఎస్టీ ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి మధును సీఎం పర్యటనను అడ్డుకుంటారన్న కారణంతో నోటీసులు ఇచ్చారు. తెల్లవారుజామునే వారిని అరెస్ట్ చేసి వజ్రకరూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించా రు.

గుంతకల్లులో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, మండల కార్యదర్శి రాము, సహాయ కార్యదర్శి రామాంజినేయులు, ఈశ్వరయ్య, ఉమర్‌బాషా, సీపీఎం నాయకులు బీ శ్రీనివా సులు, కసాపురం రమేష్, సాకే నాగరాజు, వైటీసీ రమేష్, నరసయ్య, తదితరులను ముందస్తు అరెస్ట్ చేసి వన్‌టౌన్, కసాపురం, రూరల్ పోలీస్ స్టేషన్‌లకు తరలించారు.

కణేకల్లులో సీపీఐ కార్యదర్శి గౌస్, సీపీఎం కార్యదర్శి కోరి నాగరాజు, పీడీఎస్‌యూ నాయకుడు ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ నాయకులు శాంతరాజ్‌ను మంగళవారం ఉదయమే అరెస్టు చేశారు.

రాయదుర్గంలో సీపీఐ తాలూకా కార్యదర్శి నాగార్జున, ఏఐవైఎఫ్ రాయదుర్గం తాలూకా కార్యదర్శి కొట్రేష్, ఏపీ రైతు సంఘం తాలూకా కార్యదర్శి తిప్పేస్వామి, రాయదుర్గం పోలీసులు ముందస్తుగా నోటీసులు అందజేశారు.

అబద్ధాలతో నెట్టుకొస్తున్న జగన్

గుంతకల్లు, జనవరి 23: రోజుకో అబద్ధం చెప్పి జగన్ రోజులు గడుపుతున్నాడని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడు యాదవ్ ఎద్దేవాచేశారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని దోనిముక్కల రోడ్డు, ఇందిరామ్మ కాలనీలో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలపై ఆయన ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, బొజ్జేనాయక్, కేఎల్ సీన, సంగాల రాము, కే జగదీశ్, సరస్వతి, దశరత్‌నాయక్, బండారు పులికొండ, అశోక్, రమేశ్, ఉడుదల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకొని విద్యార్థి ఆత్మహత్య

గుంతకల్లు టౌన్, జనవరి 23: పట్టణంలోని ఏకలవ్య నగర్‌కు చెందిన ఈడిగ మురళి గౌడ్, మయూరి దంపతుల కుమారుడు ఈడిగ హుసేన్‌గౌడ్(15) ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు ఈడిగ హుసేన్‌గౌడ్ పట్టణంలోని పీఅండ్‌టీ కాలనీలో చైతన్య-2 పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఉదయం పాఠశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లోనుంచి బయలుదేరాడు. పాఠశాలకు సెలవు ఉండటంతో ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. ఇంటికి వచ్చిన తల్లి ఉరికి వేలాడుతున్న కుమారుడిని కిందకు దింపి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం కాన్వాయ్‌ను అడ్డుకునే యత్నం

ఉరవకొండ, జనవరి 23: సీఎం కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు యత్నించిన సీపీఐ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. వైఎస్సార్ ఆసరా నిధులు విడుదల చేసేందుకు సీఎం ఉరవకొండకు వచ్చారు. హెలీప్యాడ్ నుంచి బహిరంగసభకు వెళ్తున్న సమయంలో అగ్నిమాపక శాఖ కేంద్రం సమీపంలో సీపీఐ నాయకులు మారువేషంలో అడ్డుకునేందుకు వెళ్లారు. వారిని పోలీసులు పసిగట్టి అరెస్ట్ చేసి వజ్రకరూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, కేశవరెడ్డి, మనోహర్, మల్లికార్జున అరెస్టయ్యారు.

అల్ట్రా మారథాన్ తొమ్మిదో ఎడిషన్ ప్రారంభం



మారథాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న మాంచో ఫెర్రర్

కుందుర్పి, జనవరి 23: మండల కేంద్రంలో అల్ట్రా మారథాన్ రన్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంచో ఫెర్రర్, మహిళా విభాగ డైరెక్టర్ విశాల ఫెర్రర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఆర్డీటీ సంస్థ పేదలు, దివ్యాంగులు, మహిళలకు ఆర్డీటీ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు వివరించారు. అల్ట్రామారథాన్ 8 ఎడిషన్‌లు విజయవంతమైన తరువాత 9వ ఎడిషన్‌ను కుందుర్పిలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కుందుర్పి నుంచి బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రి వద్ద ఈ మారథాన్ ముగుస్తుందన్నారు. భారతదేశానికి చెందిన 65 మంది రన్నర్లతో పాటు స్పెయిన్, ఈక్వెడార్, అర్జెంటీనా, ఇటలీ నుంచి మొత్తం 67 మంది రన్నర్లు ఈ మారథాన్‌లో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

పత్తికి నిప్పుపెట్టిన దుండగులు

పెద్దవడుగూరు, జనవరి23: మండలంలోని మల్లేనపల్లి గ్రామానికి చెందిన రైతు రంగయ్య నిల్వ చేసుకున్న పత్తిపంటకు మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో అగ్నికి ఆహుతైంది. బాధిత రైతు తెలిపిన మేరకు... రంగయ్య తనకున్న 20ఎకరాల భూమిలో పత్తి సాగుచేశాడు. వంద క్వింటాళ్లమేర దిగుబడి రావడంతో తన ఇంటికి సమీపంలో ఉన్న ఒక గదిలో నిల్వచేశాడు. గదికి ఉన్న కిటీకిల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. 40క్వింటాళ్లమేర పత్తి కాలిపోవడంతో దాదాపు రూ.3లక్షల దాకా నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు.

పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు

అనంతపురంరూరల్, జనవరి 23: జిల్లాలోని గుత్తి మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణ చౌదరి మంగళవారం తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.7,020తో కొనుగోలు చేస్తుందని, రైతులు తమ పంటను మార్కెట్ యార్డులో విక్రయించుకోవచ్చని తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ.. కేసు నమోదు

పెద్దవడుగూరు, జనవరి23: మండలంలోని విరుపాపురం గ్రామంలో మంగళవారం ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. దీంతో నరసయ్య, రవి, నరసింహులుతో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన తెలిపిన మేరకు ఇంటికి వెళ్లే దారిలో వాహనం అడ్డుగా ఉండటంతో తొలగించమని ఓ వర్గం వారు చెప్పారు. మరో వర్గం ఇందుకు నిరాకరించడంతో వాగ్వాదం జరిగి, ఒకరిపై ఒకరు రాళ్లతో దాడులు చేసుకున్నారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం గుత్తికి తరలించారు.

కమిషనర్ దృష్టికి సమస్యలు

తాడిపత్రిటౌన్, జనవరి 23: పట్టణంలో ఉన్న పలు సమస్యలను మున్సిపల్ కమిషనర్ రవి దృష్టికి బీజేపీ నాయకులు మంగళవారం తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ సమీపంలోని కాలువపై ఉన్న కల్వర్టు పగిలి పెద్ద గుంతగా ఏర్పడిందన్నారు. పట్టణంలో ఫాగింగ్ చేయకపోవడంతో దోమలు అధికమై ప్రజలు విషజ్వరాల బారినపడుతున్నారన్నారు. తాగునీటి కొళాయిల్లో అండర్‌డ్రైనేజీ మురుగునీరు కలుస్తోందన్నారు. చెత్త తరలించే వాహనాలను మరమ్మతులు చేయించి ప్రజలకు అందుబాటులో ఉండేలా చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆంజనేయులు, శివ తదితరులు ఉన్నారు.

డ్యాన్స్‌లో చిన్నారులకు బహుమతులు



గోవాలో బహుమతులు అందుకుంటున్న చిన్నారులు

తాడిపత్రిటౌన్, జనవరి23: పట్టణంలోని కుందన నృత్య కళానిలయం చిన్నారులు ఈనెల 21న గోవాలో జరిగిన 7వ నేషనల్ డ్యాన్స్ కాంపిటీషన్‌లో ప్రతిభ చూపినట్లు మాస్టర్ కృష్ణ మంగళవారం తెలిపారు. శివతాండవానికి ద్వితీయ బహుమతి, సోలో డ్యాన్స్‌కు 3, 4వ బహుమతులు వచ్చినట్లు తెలిపారు.

అశ్వత్థ నారాయణస్వామిని దర్శించుకున్న మాజీ స్పీకర్


స్వామిని దర్శించుకుంటున్న మాజీ స్పీకర్

పెద్దపప్పూరు, జనవరి 23: మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన అశ్వత్థ నారాయణస్వామి, శ్రీ చక్రస్థాపిత భీమలింగేశ్వరస్వామి ఆలయాన్ని మంగళవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ ప్రతిభా భారతి కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ స్పీకర్ స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. అంతకుమునుపు మాజీ స్పీకర్‌కు ఆలయ అధికారులు స్వాగతం పలికారు.

బీసీ సదస్సును జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా

పామిడి, జనవరి 23: పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డులో గల ఓ ఫంక్షన్ హాలులో బుధవారం జరిగే జయహో బీసీ సదస్సును జయప్రదం చేయాలని మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా పేర్కొన్నారు. పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డులో తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు ఎంహెచ్ లక్ష్మినారాయణరెడ్డి స్వగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం బీసీలకు ద్రోహం చేసిందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు వైయూ రామాంజనేయులు, టీటీ రమణరెడ్డి, రామకృష్ణ, వడ్డే శివకుమార్, బొమ్మా మోహన్ కృష్ణ, ఇప్పె నరసింహులు, మాధవ, మస్తాన్, ఈశ్వర్ ఆచారి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

గుత్తి, జనవరి 23: గుత్తి ఆర్ఎస్‌లోని ఓ ఫంక్షన్ హాల్ సమీపంలో ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొని కర్ణాటకకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ నాగేంద్ర(35) మృతి చెందాడు. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లా చిలకూర్తి గ్రామానికి చెందిన నాగేంద్ర మండలంలోని బాచుపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం గుత్తి వైపు ట్యాంకర్‌తో వెళ్తుండగా ఫంక్షన్ హాల్ వద్ద డీవైడర్‌ను ఢీకొని కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతను అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఫిట్స్ రావడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కులగణనను త్వరగా పూర్తిచేయండి

పుట్లూరు, జనవరి23: మండలంలో కుల గణనను త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీఓ యోగానందరెడ్డి సిబ్బందిని మంగళ వారం ఆదేశించారు. సర్వర్ సమస్యతో చాలా గ్రామాల్లో 50శాతం కూడా పూర్తికాలేదన్నారు. సర్వర్ పని చేసే చోట సర్వే పకడ్బందీగా చేయాలన్నారు. కుటుంబ పెద్ద వివరాలు, కుల వివరాలు నమోదు తప్పనిసరిగా చేసి ఫేస్ బయోమెట్రిక్ తీసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుత్తి రూరల్, జనవరి 23: మండలంలోని కొత్తపేట గ్రామశివారులోని 67వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. టీ. కొత్తపల్లికి గ్రామానికి చెందిన శివన్న ద్విచక్రవాహనంలో గుత్తి నుంచి స్వగ్రామనికి వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన శివన్నను స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన పై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నేతాజీకి ఘన నివాళి


సుభాష్ చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సభ్యులు(యాడికి)


నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న విలువల బడుల చిన్నారులు(కుందుర్పి)

స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని మంగళవారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. గుత్తిలో జేవీవీ, కాపు సంక్షేమ సేన ఆధ్వర్యంలో, గుంతకల్లులో సీపీఐ కార్యాలయంలో, యాడికి మండలంలో లయన్స్, లియో క్లబ్ ఆధ్వర్యంలో, కుందుర్పి మండలంలో ఎస్కే చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ధైర్య సాహసాలు, దేశభక్తి గురించి కొనియాడారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్